కథ

**ఉలిక్కిపడి లేచింది రమణ.**
**చీకట్లో మనిషి కనిపించడం లేదు. మళ్లీ భుజం పట్టుకుని ఊపిన తరువాత ఆ స్పర్శ తండ్రిదని అర్థం అయింది.**
**"ఏంటి నాన్నా!"**

''ఏందేంది? పైసలేడ దాసినవ్?'' కరుకుగా ఉంది దానయ్య కంఠం.

''ఏ పైసలు?''

''అయ్యే! బాపనమ్మ ఇయ్యాలే నెల జీతం'' గద్దించాడు.

''ఇవ్వలేదు'' మళ్లీ పడుకోబోయింది రమణ.

''నా కాడనా నీ యవ్వారాలు. తియ్యి పైసలు.''

''చెప్తున్నాను కదా! ఈ నెల ఇంకా జీతం తీసుకోలేదు. అయినా, ముందే రెండొందలు తీస్కొని ఇస్తిని. ఇంకొక్క యాభై రూపాయలే కదా వచ్చేది. అవయినా నాకుండద్దా!'' జీరబోయింది రమణ గొంతు.

''ఆల్ల ఇళ్లల్లి పన్జేసి భాష మంచిగనే నేర్చినవులే గానీ, ఆ యాసాలు నా కాడ జాన్తానై. తియ్యి పైసలు. పైలు బొయ్యి వారమయిపాయె. ఇయ్యకుండనే ఉంటరా!'' రమణ జుట్టు పట్టుకున్నాడు దానయ్య.

''ఒట్టు నాయినా! నేను పైసలడిగితె, ఆళ్లియ్యలే'' ఏడుస్తోంది రమణ.

''ఏందయ్యా! అర్ధరాతిరి గోలజేస్తున్నావు. లెవ్వంటుంది గద. అయినా తాగనీకి ఏలా పాలా లేదా ఎట్ల?'' పడుకునే అరిచింది రమణ తల్లి యాదమ్మ.

''సంపుత. గిప్పుడు పైసలు నా శేతిల బడాల. నేను పొవ్వాల. అమ్మా, బిడ్డ మంచిగనే ఎత్తు(తు)న్రు డ్రామాలు.'' పెళ్లాం మీద అరిచాడు దానయ్య.

''సంపు. ఒక్కసారే సస్తం. బిడ్డ కష్టం జేసిందంతా సిగ్గులేకుండ తాగుతున్నవు. పైస తెచ్చుడు రాదు గానీ, సంపుతాడంట. సంపయ్యా! మాయదారి బతుకు బతకాల్నని మేం అడిగినమా ఏంది?'' కూతుర్ని లాక్కు వచ్చి మొగుడి ముందు నుంచుంది యాదమ్మ ఆవేశంగా.

''థూ! నీ యవ్వ! మీరే సవ్వండి'' కాళ్లు ధనధనా చప్పుడు చేస్తూ గుడిసె దాటి వెళ్లిపోయాడు దానయ్య.

మొగుడిని బూతులు తిడుతూ తొందరగానే నిద్రపోయింది యాదమ్మ. రమణకు మాత్రం నిద్ర రాలేదు. ఆ చిన్న బుర్రలో అనేక ఆలోచనలు ముసురుతున్నాయి.

# వెలుగురేఖ

దేవరకొండ దగ్గరి పల్లెటూరు వెంకటాయపల్లి నుంచి వలస వచ్చిన అనేక కుటుంబాల్లో దానయ్యదీ ఒకటి. ఇద్దరు ఆడపిల్లల్లో, పెద్దదాన్ని ఊళ్లోనే ఇచ్చాడు. రెండోది రమణమ్మ. పదమూడేళ్ల పిల్ల. వచ్చీ రాగానే నాలుగిళ్లల్లో పాచిపనికి కుదిరింది. యాదమ్మ రోగిష్టిది. ఎక్కడో అక్కడ విరుచుకుని పడిపోతూ ఉంటుంది. అనారోగ్యంగా ఉన్న మనిషికి అన్నం పెట్టడమే కష్టతరం. ఇక మందులిప్పించేదెవరు? దానయ్య మట్టిపనికి వెళ్తాడు. ఆ డబ్బు, దాదాపుగా మొత్తం తాగుడుకే ఖర్చు పెడతాడు. దొరికిననాడు కూలీ, లేనినాడు తాగి పడుకుంటాడు. ఇల్లు గడిపేది రమణే. బంగారు రంగు ఛాయ, పెద్ద జుట్టు, కళ గల ముఖం. కాస్త పొట్టిగా ఉన్నా కుదురుగా ఉంటుంది రమణ. చురుకైన కళ్లతో చక్కగా ఉండే రమణను ఎవరింట్లోనయినా చూసినా కొత్తవాళ్లు, ఆ ఇంటివాళ్లకి చుట్టాలపిల్ల అనుకుంటారే గానీ పనిమనిషని అనుకోరు.

నిద్ర రావడం లేదు రమణకి.

తను పనిచేసే ఇళ్లల్లో మగవాళ్లెవరూ తండ్రిలా తాగి వచ్చి పెళ్లాం, బిడ్డల్ని తన్నరు. ఫ్రిజ్‌లో ఉన్న సీసాల్లోని ఖరీదైన మందు తాగినా, తండ్రిలా ప్రవర్తించరు. పిల్లల్ని ప్రేమగా దగ్గరకు తీసుకుంటారు. అవీ, ఇవీ కొని తెస్తారు. అంతా కలిసి సినిమాలకి, షికార్లకి వెళ్తారు. తన ఈడు వాళ్లు హాయిగా స్కూలుకి, రకరకాల టిఫిన్లు కట్టుకుని వ్యాన్‌లెక్కి వెళ్తారు. తల్లి ఆనందంగా వాళ్లకి టాటా చెప్పి పంపుతుంది. బూట్లేసి, లేసులు కట్టి మరీ పంపుతుంది. బడి నుండీ రాగానే, వాళ్లేదో చాలా కష్టపడి వచ్చినట్లు చిరుతిండ్లు, పళ్లు పెట్టి, పాలు తాగిస్తుంది. మరి తనకో, నానా కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించి ఇంటికి పోతే తండ్రి గద్దలా తన్నుకుపోతాడు. ఇంట్లో పని సరిగ్గా చేయడం లేదని అమ్మ తిడుతుంది. తోటి పిల్లలతో సినిమాకి వెళితే చాలు, తనేదో చెయ్యరాని పనిచేసినట్లు తండ్రి అనరాని మాటలన్నీ అంటాడు. ఎందుకీ తేడా? తనూ, వాళ్ల లాగానే పుట్టింది కదా! దేవుడెందుకు ఇలా చేశాడు? ఎప్పటికైనా తను వాళ్లలా బ్రతకగలదా! నులివెచ్చని నీరు కంటి నుండి ధారాపాతంగా కురుస్తుంటే ఎప్పటికో నిద్రలోకి జారింది రమణ.

★ ★ ★

''ఏవిటే రాణీ! నేను వెళ్లనా, వద్దా ఆఫీసుకి? ఎనిమిదయ్యింది టైము.'' అడిగింది రేఖ.

రమణని రాణి అని పిలుస్తుంది రేఖ. పనిపిల్లలా కనిపించదు రమణ ఆమె కంటికి. తన పిల్లలతో పాటే టిఫిన్ పెడుతుంది. జీతం కాకుండా అప్పుడప్పుడూ టిప్‌లు ఇస్తుంది. అసలు రమణ ఆ యాదమ్మకి పుట్టలేదేమో, ఏ కలిగినింటి పిల్లనో దొంగతనంగా తెచ్చేసుకున్నారేమో అని రేఖకి అనుమానం.

''గబగబా చేస్తాన్లెండి అమ్మగారూ! రాత్రి మా నాన్న కొద్దిగా గొడవ చేశాడు. నిద్రలేదు. అందుకే లేటయింది.'' సంజాయిషీగా అంటూ గిన్నెలు తోమసాగింది రమణ. చేసిన ఇడ్లీలు నాలుగు రమణకి పెట్టింది రేఖ. గిన్నెలో పెట్టుకుని మూత పెట్టింది రమణ.

''తినవేమే? ఛాయ్ ఇస్తాను. త్రాగుదువు'' అడిగింది రేఖ.

''మా అమ్మ కొరకు పట్టుకుపోతానమ్మగారూ.''

''నీ ముఖం. కష్టం నీది. ఫలితం వాళ్లది. ఇంతకీ మీ అమ్మ ఆ గుట్కా తినడం మానిందా! లేదా!''

ఏం మాట్లాడలేదు రమణ.

''ముందు ఆ గుట్కా అందకుండా చూడండి యాదమ్మకి. ఫిట్సు రోగంతో పాటు, కొత్త రోగాలు కూడా వస్తాయి ఆ పాకెట్లు కొనుక్కు తింటే'' చెప్పింది రేఖ.

''మా నాన్న తాగుడు మానడు. మా అమ్మ ఆ గుట్కా మానదు. ఎంత చెప్పినా ఇనరమ్మా! పైసలన్నీ ఆగం చేస్తున్నారు'' బట్టలారేస్తూ అంది రమణ.

రమణ వాళ్ల యాసలో కాక, చక్కని తెలుగులో మాట్లాడ్డం నేర్చుకుంది. ఫోన్ తియ్యడం,

పద్మలతా జయరాం

మాట్లాడటం, ఆధునిక గృహోపకరణాలు వాడడం అన్నీ నేర్చుకుంది. ముఖ్యంగా రేఖ ఇంట్లో ఒక వ్యక్తిలా మెలుగుతుంది.

పని ముగించుకుని వెళ్లిపోయింది రమణ.



★ ★ ★

''రాణీ! ఇక్కడెవరో మిషన్ నేర్పుతున్నారట. నేర్చుకుంటావా?'' అడిగింది రేఖ.

''నాకు చదువు రాదు గధమ్మా!'' అనుమానంగా అంది రమణ.

''అంకెలు వచ్చు కదా? అది చాలు. నెలకు యాభైట. నేనిస్తాలే. మధ్యాహ్నం పూట పని అయ్యాక వెళ్లు. రెండు నెలలు చాలు. వచ్చేస్తుంది.''

రెండు నెలల్లో కాదు, నెలరోజుల్లోనే ఆడవాళ్లకు సంబంధించిన అన్ని దుస్తులు కుట్టగలుగుతోంది రమణ. ఏది చూసినా ఇట్టే పట్టేసుకునే, ఈ తెలివైన పిల్లంటే కుట్టు టీచర్‌కి కూడా ముచ్చటేసింది. సెకండ్ హాండ్ మిషన్ ఉంది కొనుక్కోమని చెప్పింది.

''ఎనిమిది వందలంటమ్మా! నా జీతమంతా మిషనుకే ఖర్చు పెడితే, ఇంట్లో ఏం తినాలి?'' విషయం చెప్పింది రమణ.

''నెలకు ఇంత అని, నేను జీతంలో పట్టుకుంటాను. నీకు నిజంగా ఉపయోగం అనిపిస్తే కొనుక్కో'' అంది రేఖ.

సంతోషంగా ఒప్పుకుంది రమణ. అదేరోజు మిషను తెచ్చుకుంది. చేస్తున్న రెండు ఇళ్లు మానేసి, తమ గుడిసెకు దగ్గర్లో ఉండే మిగిలిన గుడిసెల వాళ్లకి బట్టలు కుట్టిస్తానని చెప్పి వచ్చింది. నాలుగు రోజులు గడిచాయి.

దిగులుగా ఉన్న రమణను చూసి అడిగింది రేఖ.

''ఏమయిందే రాణీ! మళ్లీ మీ నాన్న గొడవేమైనా చేశాడా!''

''కాదమ్మా! ఆ సచ్చినోడు, రాత్రి దొంగతనంగా మిషన్ ఎత్తుకుపోయి అమ్మేశాడు తెల్లారి అడిగితే, 'మిషనే కాదు, నిన్ను కూడా అమ్మిపారేస్తాను. ఆడదాయివి ఆడదాన్లా ఉండు' అని తిట్టాడు మిషనూ పోయింది, పనీ పోయింది'' ఏడుస్తోంది రమణ.

''బాధ పడకు. ఎంతైనా తండ్రి కదా! తిట్టకూడదు. కానీలే! ఏం చేస్తాం?'' సముదాయించింది రేఖ.

★ ★ ★

తనకు కావాలని పట్టుబట్టి, కొత్త కుట్టుమిషన్ కొని, రాణిని దాని మీద కుట్టుకోమంది రేఖ. ఇదొక అనవసరపు ఖర్చు అని విసుక్కున్నాడు రేఖ భర్త. రాణి తనకు కుట్టమని ఇచ్చిన వాటిని టైంకి అందించడంతో, గిరాకీలు బాగానే రాసాగాయి. కానీ, ఆ డబ్బు మొత్తం దానయ్య తాగుడికే పోతోంది. కాస్తో కూస్తో మిగిలితే యాదమ్మ లాగేసుకుంటోంది.

''ఇదిగో రాణీ! పేపర్లో పడింది. మీలాంటి వాళ్ల కోసం గవర్నమెంట్ ఏదో స్కీం పెట్టింది. పని నేర్చి తర్వాత లోన్ ఇస్తారట. ఆ డబ్బుతో మీరే కావల్సినవి కొనుక్కుని చిన్న షాపు తెరుచుకోవచ్చుట'' చెప్పింది రేఖ.

''ఎన్ని చేసినా దండుగేనమ్మా! మా అయ్య నాకేం మిగల్చడు'' నిర్లిప్తంగా అంది రమణ.

''నీ ముఖం! ఈసారి అలా కాదు. నేను దగ్గరుండి నీ చేత పని మొదలెట్టిస్తాను. సరేనా! ఏదీ ఒకసారి నీ పేరు, కులం, తండ్రి పేరు, వయసు అన్నీ వివరంగా చెప్పు. ఈ విషయం ఏదో నేను తెలుసుకొస్తాను'' ఉత్సాహంగా అంది రేఖ.


చెప్పింది రమణ.

''పనిమనిషి పోయిందంటే, నానా అవస్థ పడతావు. వాళ్లకి డబ్బు కనబడితే పనులు చేస్తారా?

ప్రతీది ఓవర్ చేస్తావు నువ్వు.'' విసుక్కున్నాడు రేఖ భర్త.

''ఏం ఫర్వాలేదు. పాచిపని చెయ్యడానికి మరొకళ్లు దొరక్కపోరు. ఇంత తెలివైన పిల్ల, కాస్త చేయూతనిస్తే తప్పకుండా పైకొస్తుంది'' కొట్టి పారేసింది రేఖ.

నియమనిబంధనలన్నీ తెలుసుకుని, తనే దగ్గరుండి ఆ సంస్థలో రమణను చేర్పించింది రేఖ. ప్రభుత్వం వారి కొత్త పథకం అది. పని నేర్చుకున్న రోజుల్లో రోజుకు యాభై చొప్పున ఇస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత, అయిదు వేల రూపాయల లోన్ ఇస్తారు. పాచిపనులు మానేసి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంటర్‌కి నడచివెళ్లేది




## అనురాగం

**కన్నవారికి దూరంగా ఉండే తల్లిదండ్రులు ఎంతో బాధపడతారు. రోజురోజుకీ మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయి, యాంత్రిక జీవితంగా అయిపోతోంది. రాణీముఖర్జీ తండ్రి రామ్ ముఖర్జీ ఇప్పుడిలాగే బాధపడుతున్నాడు. కూతురుతో ఎంతో అనుబంధం ఏర్పరచుకున్న రామ్ కూతురు షూటింగ్ కోసం బయటికి వెళ్లి రోజుల తరబడి ఉండడం కుటుంబసభ్యులకి బోర్ అనిపిస్తోందిట. ఆమె మాత్రం ఎక్కడికెళ్ళినా హేపీగా ఉంటోంది.**



రమణ. కుట్టుపని ముందే తెలుసు కాబట్టి, తనే మిగిలినవాళ్లకి నేర్పేది.

రెండు నెలల తర్వాత పొద్దున్నే వచ్చిన రమణను చూసి ఆశ్చర్యపోయింది రేఖ.

''ఏంటి రాణీ? ఇంత ఉదయాన్నే వచ్చావు.''

''పని చేద్దామని వచ్చానమ్మా.''

''ఏం పని?''

''పాచిపని.''

''మళ్లీ ఇదేమిటే? హాయిగా వాళ్లు డబ్బులిచ్చి మరీ నేర్పుతున్నారు గదా కుట్టుపని. అన్నట్లు లోను డబ్బులొచ్చినయ్యా!'' అడిగింది రేఖ.

''ఏం డబ్బులమ్మా! ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మొన్న ఎలక్షన్లలో గవర్నమెంట్ మారిందట గదా! అందుకని ఈ స్కీం ఎత్తేసిన్రంట. రెండు నెలలు పనులు చేయించుకుని పైస కూడా ఇయ్యలేదు.'' బాధగా అంది రమణ.

''ఎంత అన్యాయం? పోయి అడుగుదాం పద ఇవాళ'' ఆవేశంగా అంది రేఖ.

''అది కాదమ్మా! నెల రోజులు పని చేయించుకున్నాక, ఎవరో వేరే దేశం వాళ్లంట. వాళ్లు మేం ఉన్న చోటుకు వచ్చారు. వాళ్లే మిషన్‌కు పైసలు ఇస్తారట. మాకు దినానికి యాభై ఇచ్చేది కూడా ఆళ్లేనంట. ఇక్కడి సార్లు, టీచరమ్మలు మాకు ముందే చెప్పి పెట్టారు. ఆళ్లు అడిగే దానికి సమాధానం ఏం చెప్పాలో! ఆళ్లు ఇంగ్లీష్‌లో అడిగితే, మా వాళ్లు తెలుగులో మాకు చెప్పారు. మీకు రోజూ పైసలు అందుతున్నయ్యా అన్నారు. అందుతున్నయ్యని తల ఊపాం. వాళ్లు ఏమేమో అడిగారు. అన్నిటికి నవ్వుతూ తల ఊపమని చెప్పారు కదా. అట్లానే చేశాం. మిషన్లు కొనుక్కోమని అందరినీ లోను కాగితాల మీద సంతకాలు పెట్టమన్నారు. మేం వేలిముద్ర ఏసినం. ఆళ్లు ఎళ్లిపోయారు. ఇక మా టీచర్లు మాకు ఏమీ ఇయ్యలేదు. అడిగి అడిగి యాష్టకొచ్చి అక్కడికి వెళ్లడం మానేశిన'' వివరంగా చెప్పింది రమణ.

రేఖకు అర్థం అయింది. ఫారిన్ గ్రాంట్లు కొట్టేసింది ఎవరో? పేదల కోసం ఏర్పాటు చేసిన పథకాలు, ఈ విధంగా మట్టిగొట్టుకుపోతుంటే, వారికి రావాల్సిన ప్రతిఫలం ఇలా గ్రద్దల్లా ఎగరేసుకుపోతున్న ఉద్యోగుల్ని పట్టుకునేదెవరు? లోను అందిందని అమాయకంగా వేలిముద్రలు వేసిన ఈ అభాగ్యుల జీవితాలు బాగుపడేదెలాగ?

''రాణీ! నువ్వు పని కాదు చేయాల్సింది. చదువు నేర్చుకో ముందు. సాయంత్రం ఆరింటి నుంచీ ఎనిమిది దాకా నా దగ్గరే ఉండు. నీకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పుతాను. నీ కాళ్ల మీద నువ్వు నిలబడేందుకు నేను సాయం చేస్తాను'' రాణి భుజం చుట్టూ చెయ్యి వేసి అక్కున చేర్చుకుంది రేఖ.

రాణి ముఖంలో వెలుగురేఖ మెరిసింది.

ఇలాంటి రేఖలు దొరికే దాకా పేదవారి పసిపిల్లలు, పని పిల్లలు లాగానే మిగులుతారు. ఇది నిజం. ❀